ప్రజాశక్తి
మంగళవారం 25 జులై 2023 5
శ్రీ సత్యసాయి





కలెక్టరేట్లో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

గ్రీవెన్స్ వినతులపై నిర్లక్ష్యం వద్దు

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

స్పందన, జగనన్నకు చెబుదాం వినతుల పరిష్కారంపై నిర్లక్ష్యం తగదని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 283 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, డిఆర్‌డిఎ పిడి నరసయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలను పెండింగ్ లో లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. రీ ఓపెనింగ్ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను సెప్టెంబర్ 15 లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాలు త్వరగతిన పూర్తి చేయాలన్నారు. 15 రోజులకు ఒకసారి భవన నిర్మాణాలలో పురోగతి గురించి నివేదించాలన్నారు. ఆగస్టు 15 నాటికి కేటాయించిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీర్లు, ఎంపీడీవోల సహకారంతో పనులు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీలలో, మండలాల్లో ఫీవర్ సర్వే లో వెనుకబడి ఉన్నాయని తగు చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్‌ఒ ఎస్‌వి కృష్ణారెడ్డిని ఆదేశించారు. అమరాపురం, సి కె పల్లి, కనగానిపల్లి, పుట్టపర్తి, రొళ్ల, సోమందేపల్లి, హిందూపురం, గుడిబండ మండలాల్లో ఫీవర్ సర్వేలు వెనుకబడ్డాయన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం చూపే అధికారులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులన్నీ ఆన్‌లైన్ లో అప్లోడ్ కావాలన్నారు. జగనన్న సురక్ష లో 11 రకాల సేవలను ఉచితంగా అందించాలన్నారు. వ్యవసాయం, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి కౌలు రైతులకు సిసిఆర్‌పి కార్డులు అందచేయాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల విధులకు వాలంటీర్లను దూరంగా పెట్టాలన్నారు. ఈ సూచనల నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గం'జాయ్'మత్తు..!

గంజాయి మత్తు యువతను చిత్తు చేస్తోంది. జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ విశాఖపట్నం ఏజెన్సీ నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలోకి వస్తోంది. విశాఖపట్నం, అరకు ప్రాంతాలకు చెందిన కొందరితో సంబంధాలు పెట్టుకుని జిల్లా ప్రాంత వాసులు గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్నారు. బయట నుంచి తీసుకువచ్చిన గంజాయిని చిన్నచిన్న పాకెట్లలో విక్రయిస్తున్నారు. చిన్న ప్యాకెట్ గంజాయి రూ.వంద వరకూ పలుకుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని ఈ గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. హిందూపురం కేంద్రంగా గంజాయి ఎగుమతి, దిగుమతి జరుగుతున్నట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి-హిందూపురం

చెడు వ్యసనాలకు బానిసైన కొందరు గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారు. విశాఖ నుంచి హిందూపురానికి గంజాయిని తీసుకొచ్చి అక్కడి నుంచి హిందూపురంతో పాటు అనంతపురంలోని కొన్ని ప్రాంతాలకు, కర్నాటకలోని కొన్ని ప్రాంతాలకు వీటిని తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయి తరలింపులో పురం పారిశ్రామిక వాడలో వివిధ పరిశ్రమల్లో పని చేసే ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరంత ఎవరికీ అనుమానం రాకుండా రైలులో వెళ్లి, అదే రైలులో తీసుకొచ్చి రైల్వే స్టేషన్ సమీపంలో దాచి పెట్టి క్రయ విక్రయాలు జరుతున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వీరి నుంచి పట్టణానికి చెందిన కొంద మంది యువకులు కొనుగోలు చేసి సేవించడంతో పాటు ఇతరులకు అధిక డబ్బులకు విక్రయిస్తున్నారు. గతంలో కర్నాటక మద్యాన్ని విక్రయించే వారు సైతం అధిక లాభాలు వస్తుండడంతో గంజాయి అమ్మకాలపై దృష్టి సారించారు. పట్టణం నుంచి వేలాది మంది నిత్యం బెంగళూరుతో పాటు ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం రాక పోకలు సాగిస్తున్నారు. ఇతర రాష్ట్రాల వారు సైతం పెద్ద ఎత్తున్న వచ్చి వెళుతున్నారు. ఇలాంటి వారిలో కొందరు ఈ గంజాయి మహమ్మారికి అలవాటు పడి వాటి విక్రయాల ఉచ్చులో పడుతున్నారు. వీరంతా పురం పారిశ్రామిక వాడిలోని కార్మికులతో కలిసి పోతుండడంతో వారిని పోలీసులు గుర్తించడంలో కష్టం అవుతోంది. ఇటీవల గంజాయిపై జిల్లా ఎస్పీ ఉక్కుపాదం మోపడంతో దీనిపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలోనే సోమవారం నాడు ఎనిమిది మందిని అరెస్టు చేసి దాదాపు 9 కిలోల గంజాయిని హిందూపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

- హిందూపురం కేంద్రంగా అమ్మకాలు
- ఉమ్మడి అనంత జిల్లాకు సరఫరా
- విశాఖ నుంచి పురానికి దిగుమతి
- యువతే లక్ష్యంగా వ్యాపారాలు



గంజాయి మత్తులో యువత

యువత గంజాయి మత్తులో తూలుతూ పెడదోవ పడుతోంది. ఈ మత్తుకు బానిసైన వారిలో ఎక్కువ మంది 30 సంవత్సరాలలోపు ఉన్న వారే ఉన్నారు. హిందూపురం ప్రాంతంలో ఖాళీ ప్రదేశాలు, వెంచర్లు వేసిన ప్రాంతాలను స్థావరాలుగా చేసుకుంటున్నారు. గుంపులుగా చేరి గంజాయిగుప్పు గుప్పున పీలుస్తున్నారు. ఈమత్తులోనే నేరాలకూ పాల్పడుతున్నారు. దాంతో అవెవైన కనిపిస్తే దాడికి దిగుతున్నారు. విద్యార్థినులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడ నుంచి జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాలు, గ్రామాలకు గంజాయి సరఫరా చేస్తున్నారు.

ఇవే అడ్డాలు...

హిందూపురం, మడకశిర, పెనుకొండ, ధర్మవరం, అనంతపురం జిల్లాలోని అనంతపురం తదితర పట్టణాలు మండల కేంద్రాల్లో సైతం గంజాయి లభిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాన్ సెంటర్లు, దాబాలు, రైల్వే స్టేషన్, ఆర్‌టిసి బస్టాండ్ తదితర ప్రాంతాలను అడ్డగా చేసుకుని వీటిని విక్రయిస్తున్నట్లు సమాచారం. గంజాయి ఎక్కడ దొరుకుతుందో దానికి బానిసైన యువత వద్ద పక్కా సమాచారం ఉటుంది. కోడ్ భాషలో యువకులు దీనిని కొనుగోలు చేస్తున్నారు. ఈ మత్తుకు బానిసైనైన వారు మరికొందరికి అలవాటు చేస్తున్నారు. గతంలో హిందూపురంలో గంజాయి అంటే ఏమిటో తెలియదు, ప్రస్తుతం కిలోల కొద్ది గంజాయి పట్టుబడుతోంది.

గంజాయి రవాణాపై నిఘా

గంజాయి అక్రమ రవాణా కార్యకలాపాలు నిర్మూలించే వారిపై ఉక్కుపాదం మోపేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఉంచాం. హిందూపురం ప్రాంతంలో రవాణ కాకుండా నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశాలు జారీ చేశాం. ఆరోగ్యానికి హాని కలిగించే మత్తు పదార్థాలు, నాటు సారాయి, గంజాయి మొదలగు పదార్థాల నియంత్రణ విషయంలో పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటున్నాం. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోరాదు. గంజాయి విక్రయించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. ఎక్కడైనా వీటి విక్రయాలు జరుగుతుంటే సంబంధిత ప్రాంత ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

డీఎస్పీ కంజాక్షన్.

8.900 కిలోల గంజాయి స్వాధీనం

ఎనిమిది మంది అరెస్టు

6



సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ కవి ఏలూరి ఎంగన్న

తెలుగభాష పరిరక్షణ అందరి బాధ్యత

ప్రముఖ కవి ఏలూరి ఎంగన్న

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రముఖ కవి ఏలూరి ఎంగన్న పేర్కొన్నారు. ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో సోమవారం నాడు గుర్రం జాషువా 52వ వర్ధంతి సందర్భంగా "తెలుగు భాష రక్షణ మనబాధ్యత" అన్న అంశంపై ప్రధానోపాధ్యాయురాలు శైలజ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరి ఎంగన్న మాట్లాడుతూ తెలుగు కవులు వంటి ఘనులు.. తెలుగు తనం వంటి తియ్యదనం లేదన్నారు. తెలుగు ప్రపంచంలో 6వ స్థానం, దేశంలో 3వ స్థానంలో ఉందన్నారు. అయితే నేటి పాలకుల నిర్లక్ష్యం వల్ల తెలుగు నిర్లక్ష్యానికి గురవుతోందని చెప్పారు. గిడుగు రామ్మూర్తి ఉద్యమస్ఫూర్తితో భాషను రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జాషువా జీవితం, సాహిత్య కృషి అందరికీ ఆదర్శం కావాలని చెప్పారు. సాహితీ స్రవంతి కన్వీనర్ హరి మాట్లాడుతూ భాషా దినోత్సవాలు జరుపు కోవడం, ఆరోజు మాత్రమే భాష గొప్పతనం గురించి మాట్లాడుకోవడమే కాదని అమలుకు కషి చేయాలన్నారు. హిందీ పండితులు వేణుగోపాలచారి, ఊర్దూ టీచరు తెలుగు బాష గొప్ప తనం, ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకూ వేరుశనగ విత్తుకోవచ్చు : ఎఒ

సోమందేపల్లి : ఈ నెలాఖరు వరకూ వేరుశనగ విత్తుకోవడానికి అదునుగా ఉంటుందని ఏఓ కవితా రాణి రైతులకు సూచించారు. ఈ నెల 25, 26వ తేదీ వరకూ వర్షాలు కురిసే సూచనలు ఎక్కువగా ఉన్నాయని, రైతులు గమ నించి వేరుశనగను ఈ నెలాఖరు వరకూ విత్తుకోవచ్చని, ఆగస్టు 15 వరకు కంది, ఆముదం, రాగులు, కొర్రలు వేసుకోవచ్చన్నారు. ఆగస్టు నెలాఖరు వరకూ జొన్నలు, పెసలు, అలసందలు, శనగలు విత్తుకోవడానికి అవకాశం ఉందన్నారు. విత్తనం వేయడానికి సమయం ముగిసిందని అపోహ పడకుండా రైతులు కాలానుగుణంగా సంబంధిత పంటలు వేసుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే సంబంధిత రైతు భరోసా కేంద్రం వెళ్లి సూచనలు సలహాలు తీసుకోవాలని తెలిపారు.

దళితుల శ్మశానవాటిక స్థలాన్ని కాపాడండి :కెవిపిఎస్

పెనుకొండ : పట్టణంలోని ఎస్సీ కాలనీ దళితుల శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ సోమవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమ య్య, కార్యదర్శి రమణ, సహాయ కార్యదర్శి వెంకటేష్, సిపిఎం మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ దళితుల శ్మశానవాటిక స్థలాన్ని సర్వే చేయించి హద్దులు చూపించాలని కోరారు. అలాగే కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామ ని హెచ్చరించారు. ధర్నాలో కాలనీ వాసులు, ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయు లు, సుబ్బయ్య, వెంకటేష్, రాము, రామాంజి, హర్ష, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'గుండుమల'పై ఈరన్న విమర్శలు అవాస్తవం

మడకశిర : టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామిపై మాజీ ఎమ్మెల్యే ఈరన్న చేసిన ఆరోపణలు, విమర్శ లు నిరాధారం, అసత్యం అని పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గుండుమల వల్ల టిడిపిలో సీనియర్ నాయకులకు అన్యాయం జరిగిందన్న విమర్శలు పూర్తిగా అవాస్తవం అన్నారు. 2014 ఎన్నికల్లో ఈరన్న విజయానికి గుండుమల సారథ్యమే ముఖ్య కారణమన్నారు. 2019లో కూడా గుండుమల సూచనల మేరకే నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి శ్రేణులు ఈరన్నకు మద్దతు తెలిపారన్నారు. గుండుమల టిడిపి సిద్ధాంతాలు, చంద్రబాబు నాయకత్వానికి కట్టుబడి పని చేస్తున్నారన్నారు.

సింగిల్‌విండో మాజీ డైరెక్టర్‌కు పరామర్శ

గోరంట్ల రూరల్ : గోరంట్ల మాజీ కోఆప్షన్ సభ్యులు, టిడిపి జిల్లా మైనార్టీ సహాయ కార్యదర్శి అజ్మతుల్లా తండ్రి సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ రహంతుల్లాను సోమవారం టిడిపి జిల్లా మైనార్టీ అధ్యక్షులు భక్తర్‌వలి పరామర్శించా రు. ఆసుపత్రిలో అనారోగ్యానికి గురైన రహంతుల్లా ఆసుపత్రిలో చికిత్స అనంతరం గోరంట్లలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటుండగా భక్తర్‌వలి పరామర్శించారు. అనంతరం ఆయన పలువురు టిడిపి నాయ కులను కలిసి యోగ క్షేమాలు అడిగి తెలుసుకు న్నారు. ఆయన వెంట బాబు, అన్వర్‌బాషా, రిజ్వాన్, అలీ ఖాన్, తదితరులు ఉన్నారు.



రహంతుల్లాను పరామర్శిస్తున్న భక్తర్‌వలి

మణిపూర్ ఘటన హేయం

పలుచోట్ల వెల్లువెత్తిన నిరసనలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మణిపూర్ ఘటన దుర్మార్గమని సిఐటియు, సిపిఎం నాయకులు అన్నారు. మణిపూర్ ఘటనపై సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ లో మహిళలపై అక్కడున్న ప్రజలపై జరుగుతున్న హింసకు నిరసనగా స్థానిక సిఐటియు కార్యాలయం నుండి కళాజ్యోతి, కాలేజ్ సర్కిల్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా ఐద్వా గౌరవాధ్యక్షురాలు దిల్షాద్, చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజినేయులు, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం పట్టణ కార్యదర్శి నామాల నాగార్జున మాట్లాడారు. అంతులేని అకృత్యాలకు మణిపూర్ రాష్ట్రం కేంద్రంగా మారిందన్నారు.అక్కడి మహిళల కన్నీటి కథలు, డబుల్ ఇంజన్ సర్కార్ వైఫల్యం కుతంత్రాలను ఎత్తిచూపుతున్నాయన్నారు. అమానుషమైన ఈ ఘటనలను ఖండిస్తూ మహిళలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. దేశం కోసం పోరాడి తన కాలిని పోగొట్టుకున్న ఒక సైనికుడి భార్యకే ఇలా జరిగితే సామాన్యప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మణిపూర్ జరుగుతున్న హింసాత్మక ఘటనలకు బాధ్యత వహిస్తూ డబుల్ ఇంజన్ సర్కార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ ఆదినారాయణ, అయూబ్‌ఖాన్, సిపిఎం నాయకులు ఖాశింవలీ, డివైఎఐఐ బాలాజీ, షెక్షావలి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు చంద్రకళ, పోతక్క, దీనా, అరుణ, చింతమ్మ, మున్సిపల్ కార్మికసంఘం నాయకులు బాబు, చెన్నకేశవులు, వెంకటేశ్, ప్రసాద్, ముకుంద, పెద్దక్క తదితరులు పాల్గొన్నారు.



హిందూపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

హిందూపురంలో శాంతి ర్యాలీ

హిందూపురం : మణిపూర్ ఘటనను నిరసిస్తూ హిందూపురంలోని క్రైస్తవ, ప్రజా సంఘాలు, ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. పౌరుల రాజ్యాంగ హక్కులను కాపాడాలని, మహిళలకు రక్షణ కల్పించాలని, వెంటనే మణిపూర్‌లో శాంతి భద్రతలను నెలకొల్పలని నినాదాలు చేశారు. తహశీల్దార్ హసీనా సుల్తానకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎ ఐ సి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ఉదయ్ కుమార్, రేవ. స్టీఫెన్ రాజ్, ఆనంద్ రాజ్, విక్టర్ జాషువా, శ్రీరాములు, మల్లెల సునీల్, పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు రేవ. డేవిడ్, రేవ. సూర్య ప్రకాష్, రేవ. దేవరాజ్, కౌన్సిలర్ మల్లిఖార్జున, ముస్లిం నాగరా ఉమర్ ఫరూక్, మౌలానా రిజా ఉర్ రెహమాన్, మౌలానా సాజిద్, మౌలానా ఫయాజ్, ముఫ్తీ ఇబ్రహీం, మౌలానా షాబుద్దీన్, చైతన్య గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

మణిపూర్ సంఘటనను నిరసిస్తు సోమవారం రాత్రి జోరు వానలోను గోడుగులు పట్టుకుని సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పట్టణంలో క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జగదీష్ మాట్లాడుతు మణిపూర్ ప్రజలకు భద్రత కల్పించి, ఈ సంఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి ఆనంద్, రామచంద్ర, రామాంజనప్ప, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

పెనుకొండలో నిరసన ర్యాలీ

పెనుకొండ : మణిపూర్‌లో చోటుచేసుకున్న సంఘటనలకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మహిళలపై హింసను నివారించే చర్యలు తీసుకోవాలని సోమందేపల్లి మేజర్ గ్రామ పంచాయతీ వైసిపి సర్పంచి గంగాదేవి నరసింహమూర్తి, ఎబిఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు, నాగినాయన చెరువు సర్పంచ్ అంజినాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరయు సోమవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. అలాగే అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో తక్షణమే శాంతియుత వాతావరణం నెలకొల్పాలన్నారు. అలాగే మహిళలపై జరుగుతున్న హింసాకాండను అక్కడి ప్రభుత్వం అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

నక్కలగుట్టలో అక్రమ కట్టడాలను తొలగించాలి

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వైసిపి సర్పంచుల ధర్నా

ప్రజాశక్తి -పెనుకొండ

సోమందేపల్లిలోని నక్కలగుట్ట కాలనీలో అక్రమ కట్టడాలు తొలగించి, ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని అధికార పార్టీకి చెందిన సోమందేపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచి గంగాదేవి నరసింహమూర్తి, నాగినాయనచెరువు సర్పంచి అంజినాయక్, వైస్ ఎంపిపి వెంకటనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక వైసిపి నాయకులు, ప్రజలతో కలిసి పెనుకొండ పట్టణంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టగా ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న పెనుకొండ సిఐ, ఎస్ఐలు కరుణాకర్, రమేష్ బాబు, సోమందేపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ సిబ్బందితో అక్కడికి చేరుకుని బలవంతంగా వారిని అరెస్ట్ చేసి, వెంటనే విడుదల చేశారు. అనంతరం వారు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన చేపట్టి సబ్ కలెక్టర్ కె.కార్తీక్‌కు వినతి పత్రం సమర్పించారు. స్పందించిన సబ్ కలెక్టర్ సోమందేపల్లి తహశీల్దార్, ఎంపిడిఒ, సచివాలయ సిబ్బందితో మాట్లాడి అర్హులందరూ ఇళ్ల స్థలాల కోసం సచివాలయంలో నమోదు చేసుకునేలా చూస్తామ ని హామీ ఇచ్చారు. నక్కలగుట్ట కాలనీలో సర్వే జరుగుతోందని, పట్టాలు లేకుండా అక్రమంగా నిర్మాణం చేపట్టిన ఇళ్లను ఆపుతామన్నారు. అలాగే ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఈశ్వర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, చాలకూరు జగదీష్‌రెడ్డి, ఎస్ఎం బాషా, గాజుల ప్రతాప్, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



పెనుకొండలో రోడ్డుపై బైఠాయించిన వైసిపి సర్పంచులు, నాయకులు

టిడిపి 'సూపర్ సిక్స్'తో భవిష్యత్తుకు భరోసా

చెన్నేకొత్తపల్లి-ప్రజాశక్తి

టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో వైసిపిలో భయం కనిపిస్తుందని, అందుకే ప్రతిపక్షాలపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగసముద్రం గ్రామంలో సోమవారం ఆమె స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్‌సిక్స్ పథకాలను కచ్చితంగా అమలుచేస్తుంద న్నారు. అన్ని వర్గాలను సంతప్తి పరిచేలా చంద్రబాబు త్వరలో పూర్తిస్థాయి మేనిఫెస్టో ప్రకటిస్తారని తెలిపారు. అంతకుముందు సునీతకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు.

కనగానపల్లి : 'మహాశక్తి చైతన్య యాత్ర'లో భాగంగా టిడిపి ఆధ్వర్యంలో మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. అలాగే రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నేతలు మాట్లాడుతూ మహిళలకు గతంలో ఎప్పుడూ లేనివిధంగా చంద్రబాబు కొత్త పథకాలను ప్రకటించారని, రానున్న ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, తెలుగు యువత సురేష్‌చౌదరి, శంకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, దేవరాజు, రామసుబ్బమ్మ, రాములమ్మ, స్రవంతి, అరుణమ్మ, రత్నమ్మ, అనితమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మామిళ్లపల్లిలో కరపత్రాలు పంచుతున్న టిడిపి నాయకురాళ్లు

పెనుకొండ : ఓటు వేయడం మన బాధ్యత, ఓటుతోనే భవిష్యత్తుకు భరోసా అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సవితమ్మ మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వచ్చి ఓటరు వెరిఫికేషన్ చేపడతారని, మీ ఓటు ఉందో లేదో చూసుకోవాలని, లేకపోతే తక్షణమే నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగు భవిష్యత్తుకు గ్యారెంటీ హామీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయ కులు మాధవనాయుడు, శ్రీరాములు, ప్రసాద్, సర్పంచి నరసింహులు, కోనాపురం ప్రసాద్, సుబ్బు, బాబుల్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, బాలాజీనాయక్, ఆది, సనాఉల్లా, నిస్సార్, దాదు, సోము, మల్లికార్జున, హేమంత్, మంజు, మోహన, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా మొహరం : సిఐ

గోరంట్ల రురల్ : మండల పరిధిలోని గ్రామాల్లో జరిగే మొహర్రం వేడుకలను హిందూ ముస్లింలు కలిసి మెలిసి చేసుకో వాలని సిఐ సుబ్బరాయుడు సూచించారు. మొహర్రం వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించుకోవాల న్నారు. ముఖ్యంగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి అనుమతి తీసుకోవాలని, అలా కాకుండా ఏమైనా గొడవలు, ఘర్షణలు ఏమైనా జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏమైనా జరిగే సూచనలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.

చంద్రబాబును సిఎం చేయడమే లక్ష్యం

మడకశిర : రాబోయే ఎన్నికల్లో టిడిపి జెండా ఎగురవేసి చంద్రబాబును సిఎం చేయడమే లక్ష్యంగా పని చేస్తామని నియోజకవర్గంలోని ఐదు మండలాలు, మున్సిపాలిటీ కన్వీనర్లు స్పష్టం చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో టిడిపి బలోపేతానికి మరింత ఉత్తేజంతో కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్లు మద్దనకుంటప్ప కుమార్ స్వామి, దాసిరెడ్డి, మనోహర్, లక్ష్మీనారాయణ, గణేష్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త బులుగుండ్ల వెంకటేశ్(60) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. మతిచెందాడు. విషయం తెలుసుకున్న 27వవార్డు టీడీపీ నాయకులు చిల్లా బొట్టుకిష్ట, బొట్టుశ్రీను, డిషనాగరాజు, సీబీఎన్ రామకృష్ణ, సత్తి, గోసలరాము, పావురాల శీన, తిరుపాలు తదితరులు వెంకటేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కదిరి టౌన్ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టామని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. కదిరి మున్సిపాలిటీ ఆర్ఎస్ రోడ్డు, నూతన దళిత కాలనీ కుమ్మర వీధి, సయ్యద్ వీధి, గాంధీనగర్‌లో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పరికీ నజీమున్నీసా సాదిక్, వైస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై గడ్డి విత్తనాలు

బత్తలపల్లి : పాడి పరిశ్రమపై ఆధారపడిన రైతులకు రాయితీపై గడ్డి విత్తనాలు, గడ్డి కత్తిరించు యంత్రాలను పంపిణీ చేస్తామని బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ డాక్టర్ ఎమ్. శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు మేలైన సిఎస్ హెచ్24 ఎంఎఫ్ రకం గడ్డి విత్తనాలు 75 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్నామన్నారు. అదేవిధంగా గడ్డి కత్తిరించు యంత్రాలు కూడా పంపిణీ చేస్తున్నామన్నారు.

ఘనంగా ఐదో సరిగెత్తు వేడుకలు

బత్తలపల్లి : మొహరం వేడుకలలో భాగంగా సోమవారం ఐదో సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బత్తలపల్లి బాసీంస్వామికి నిత్యపూజ నివేదన నిర్వహించారు. ఉదయం ముజావర్లు జిలానీ, టైలర్ రియాజ్, మహబూబ్‌బాషా, నజరుల్లా, కాశీంవలి ఖాసీంస్వామి చావిడిలో ఫాతెహ చేశారు. గ్రామంలో పండుగ కోలాహలం నెలకొంది.

పర్యావరణ పరిరక్షణ విద్యార్థుల బాధ్యత

పుట్టపర్తి రూరల్: గ్రామీణ ,పట్టణ ప్రాంతాల్లో పర్యావరణాన్ని పరిరక్షించడంలో విద్యార్థుల బాధ్యత ఎంతో ఉందని గ్రీన్ భారత్ ఫౌండర్ రెడ్డి వారి శంకర్ నారాయణ పేర్కొన్నారు. పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రసాద్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రమేష్ బాబు ,గ్రీన్ భారత్ ఎడ్యుకేషన్ వెంకటరత్నం ,లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేతలకు అండగా ఉంటాం

ధర్మవరం టౌన్ : చేనేతలకు టిడిపి అండగా ఉంటుందని ఆపార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. గత నెలలో విజయవాడ ఆలయ శిల్స్ యజమాని అవినాశ్ గుప్తా ధర్మవరం పట్టుచీరల వ్యాపారులు గిర్రాజుశశి, కోటం ఆనంద్‌పై చేసిన దాడిపట్ల పరిటాల శ్రీరామ్ తీవ్రంగా స్పందించారు. తాను అమెరికా పర్యటనలో ఉన్న కారణంగా బాధితులను కలవకపోయానన్నారు. సోమవారం బాధిత వ్యాపారులను కలిసినట్లు చెప్పారు. చీరలు తీసుకున్న వాటికి డబ్బులు ఇవ్వకుండా వేధింపులు చేయడం సమంజసం కాదన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బాబావలి


నిరసన దీక్ష చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో బిపిఎల్ షోరూం ఎదురుగా 5 గంటల పాటు దీక్ష చేపట్టారు. దీక్షలో పాల్గొంటున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులకు సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ పూలమాలలు వేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడుతు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమై 47 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నేటికీ ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు ఇవ్వడానికి నిరాకరిస్తుందంటే పేద విద్యార్థులకు చదువును దూరం చేయడమేనని విమర్శించారు. 3 వేలకు పైగా అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకపోవడం దుర్మార్గమన్నారు. అధ్యాపకులు లేకుండా చదువెలా సాగుతుందని ప్రశ్నించారు. నేటికీ 474 ఇంటర్మీడియట్ కళాశాలల్లో 210 మంది ప్రిన్సిపల్స్ లేరని, 26 జిల్లాలకు పర్మినెంట్ ఆర్ఐఒలు, 13 మంది డిఇఒలు లేరని అన్నారు.. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై భారత విద్యార్థి ఫెడరేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డుని కలవడానికి వెళ్తే వారిని కనీసం కలిసే అవకాశం ఇవ్వకుండా రోడ్లపై అరెస్ట్ చేయడం సిగ్గుమాలిన చర్యని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, అదే సందర్భంలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు, నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, దానికి ఎనిమిది గంటలు నిరసన దీక్షలే ప్రారంభ సూచిక అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ హిందూపురం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు తరుణ్, చంద్రశేఖర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శులు హర్ష కుమార్, పవన్, సిఐటియు నాయకులు నరసింహప్ప, రామకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జై చంద్ర, లిఖిత్, రాజా, నిహాల్, వీరేష్, బాబా ఫక్రుద్దీన్, రంగనాథ్, రవితేజ, నందీష్, గిరీష్, లోకేష్, విశ్వ, సూర్య, గిరీష్, రామ్, ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - చిలమత్తూరు

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని సబ్‌కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఆర్‌బికె వద్ద సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి స్పందనలో అదిక సంఖ్యలో అర్జీదారులు తమ అర్జీని ఇచ్చేందుకు పోటీ పడ్డారు. మండలంలో రీ సర్వే జరుగుతున్న నేపథ్యంలో భూ సంబందిత అర్జీలు ఎక్కువగా వచ్చాయి. డిపట్టా భూములు కొనుగొలు, తమ భూములను మరొకరు 1బిలో ఎక్కించుకున్నారన్న సమస్యలు,ఇంటి నిర్మాణం,ఇళ్ల స్థలాలు,రైతు భరోసా,పంట నష్టపరిహారం పై ఎక్కువ మంది అర్జీలు ఇచ్చారు. డివిజన్ స్థాయి స్పందన కావడంతో చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం నుండే కాకుండా గోరంట్ల,పరిగి,సోమందేపల్లి మండలాల నుండి కూడా ప్రజలు వచ్చి తమ అర్జీలకు అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

టేకులోడు భూములపై స్పష్టత ఇవ్వండి

గత రెండేళ్ల క్రితం టేకులోడులో సెజ్ పేరుతో 880 ఎకరాల భూమిని తీసుకుంటామని అధికారులు సర్వే చేశారు. గ్రామ సభలో ఎకరాకు రూ.25 లక్షలు నష్టపరిహారం ఇస్తామని తేల్చారు. కాని ఇప్పటి వరకు ఎలాంటి ఉలుకు పలుకు లేదు.తాము సాగు చేసుకోవాలన్న,నీటి బోర్లు వేసి అబివృద్ధి చేసుకుందామంటే అధికారులు వాటిని తిరస్కరిస్తున్నారని రైతులు వాపోయారు. ఇంతకీ ఆ భూములు తీసుకుంటారా లేదా స్పష్టం చేయాలని సబ్ కలెక్టర్ కార్తీక్‌ను కోరారు.ప్రభుత్వానికి భూములు అవసరం అయితే నోటిఫికేషన్ వదులుతామని అయితే ఇప్పటి వరకు నోటిపికేషన్ రాలేదంటే ప్రభుత్వానికి భూమి అవసరం లేదని అర్థం అని స్పష్టం చేశారు.దీంతో టేకులోడులో సెజ్ కు ఇప్పటిలో భూములు తీసుకునేది లేనట్లు స్పష్టం చేశారు.

కోడూరులో ఆసుపత్రిలో అదనపు భవనం నిర్మాణానికి వినతి

ప్రభుత్వం కోడూరులో పిహెచ్‌సి ఏర్పాటు చేయడానికి గతంలో భూమిని కేటాయించింది. ఇంకా నిర్మాణం కాక మునుపే ఇద్దరు డాక్టర్లను నియమించింది కాని అక్కడ నిర్మాణం లేదనే వంకతో డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదు. కావున కొడికొండ చెక్‌పోస్ట్ లో ఉన్న టాక్స్ డిపార్ట్‌మెంట్ భవనం ఖాళీగా ఉంది. అందులో ఆసుపత్రి నిర్వహణకు అవకాశం ఇవ్వాలని కోడూరు సర్పంచి మురళీ స్పందనలో దరఖాస్తు చేశారు.


వినతిపత్రం అందజేస్తున్న టేకులోడు రైతులు

బత్తలపల్లి : ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో అందే అర్జీలను తక్షణమే పరిష్కరించాలని తహశీల్దార్ యుగేశ్వరిదేవి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి ప్రతి అధికారి తప్పక హాజరు కావాలన్నారు. అదేవిధంగా గ్రామ స్థాయిలో గ్రామ సచివాలయ ఉద్యోగులు అందరూ హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నియంతలా ఆర్టీసీ డిపిటిఒ వ్యవహారం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఆర్టీసీలో జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ నియంతలా వ్యవహరిస్తున్నాడని తన ధోరణి మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని జిల్లా ఎన్‌జిఒ అధ్యక్షులు లింగ రామ్మోహన్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తున్న ఎన్ఎంయు జిల్లా కార్యదర్శి షబ్బీర్‌ను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిరంతరం కార్మికుల కోసం శ్రమిస్తున్న అతనిని ఏ కారణం లేకుండా సస్పెండ్ చేయడాన్ని చూస్తే డిపిటిఒ నిరంకుశ వైఖరి ఏమిటో తెలుస్తోందన్నారు. షబ్బీర్‌పై ఎలాంటి ఆరోపణలు కేసులు లేవన్నారు. కార్మికుల సమస్యలపై కలెక్టర్ ను, ప్రజా ప్రతినిధులను కలిసి విన్నవించాడని, ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపాడని ఈకక్షతో సస్పెండ్ చేయడం దారుణమని అన్నారు. ఈ డిపిటిఒ ఎక్కడ పని చేసినా, కార్మికులను చిన్న చూపు చూడడం, దుర్భాషలాడటం సస్పెండ్ చేయడం పరిపాటిగా మారిందన్నారు. షబ్బీర్ సస్పెన్షన్ ఎత్తివేయకపోతే ఆర్టీసీ కార్మికులు చేపట్టే ఆందోళనలకు ఎన్‌జిఒ సంపూర్ణ మద్దతు ఇస్తామని ప్రకటించారు.

కుమార్తె ఆచూకీ తెలపాలని విన్నపం

పుట్టపర్తి రూరల్: కనపడకుండా పోయిన తన కుమార్తె ఆచూకీ తెలపాలని బాలిక తల్లిదండ్రులు ఎస్పీకి వినతిని సమర్పించారు. ఈ మేరకు శ్రీ సత్య సాయి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మండలంలోని కంబాలపర్తి గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమార్తె ప్రియదర్శిని (16) అనంతపురం వివేకానంద కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోందన్నారు. జులై 19వ తేదీన కళాశాలకు వదలి వెళ్లడానికి వెళుతున్న తరుణంలో కొత్త చెరువు ప్రధాన కూడలిలో కనపడకుండా పోగా, ఆమె తండ్రి కొత్తచెరువు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. అయితే ఇంతవరకు బాలిక ఆచూకీ తెలియక పోవడంతో ఆవేదన చెందిన తల్లిదండ్రులు సోమవారం ఎస్పీని కలిసి విన్నవించారు. తన కుమార్తెను కొందరు యువకులు బలవంతంగా కారులో ఎక్కిస్తున్న దృశ్యాలు సైతం సీసీ కెమెరాలు నిక్షిప్తమయ్యాయని వాటిని పరిశీలించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. అదేవిధంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు ఎస్పీకి తమ సమస్యలను విన్నవించారు. వారి సమస్యలను ఇన్న ఆయన చట్ట పరిధిలోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డితో పాటు అదనపు ఎస్పీ ఎన్. విష్ణు, దిశ డీఎస్పీ వరప్రసాద్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక చేయూత

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఉమ్మడి రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేం దుకు టీడీపీ చేయూతనిచ్చిందని ఆపార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా మహాశక్తి చైతన్యయాత్రను సోమవారం పరిటాలశ్రీరామ్ ప్రారంబించారు. ముందుగా స్థానిక టీడీపీ కార్యాలయంలో చైతన్య యాత్ర రథానికి తెలుగుమహిళలతో కలిసి ప్రత్యేక పూజలుచేశారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మహిళలకు మొదటి నుంచి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. తొలి మ్యానిపేస్టోలో కూడా మహిళలకు ప్రత్యేకంగా కొన్ని పథకాలను రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుమహిళలు సాహెబ్బీ, బీబీ, స్వర్ణకుమారి, మున్ని, సునంద తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు

నల్లచెరువు : మండల కేంద్రంలోని కెజిబివిలో ఆర్డీటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మూడు నెలల పాటు మార్షల్ ఆర్ట్స్, యోగాపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. 25 మంది విద్యార్థినిలకు కరాటే, మరో 25 మంది విద్యార్థినిలకు యోగాపై శిక్షణ ఇప్పించేందుకు అయ్యే ఖర్చును ఆర్డీటీ భరిస్తోంది. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీటీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికలు కరాటే నేర్చుకోవడం తప్పనిసరి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ వరలక్ష్మి, ఆర్‌డిటి.రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, నల్లచెరువు ఎటిఎల్ సుకన్య, నల్లచెరువు ఉమెన్స్ ఎస్‌టిఎల్ వనజా, కేజీబీవీ ప్రిన్సిపల్ శిరీష, కరాటే నేషనల్ సెక్రెటరీ డాక్టర్ షేక్షావలి, మనుస్ డాన్స్ అకాడమీ కొరియోగ్రాఫర్ డాక్టర్ మనోహర్, కరాటే ట్రైనర్స్ సభ ఖానం, సిరి, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. డీఎస్పీ శ్రీనివాసులు, టూటౌన్ సిఐ రాజాలతో శాంతిభద్రతలపై పర్యవేక్షించారు. టూటౌన్ పరిధిలో వచ్చే వార్డుల్లో ఎక్కడా అసాంఘిక కార్యకలాపాలు జరగకూడదని ఎస్పీ ఆదేశించారు. వార్డుల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చిన్నపాటి గొడవలు కూడా జరగకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. మట్కా, పేకాట తదితర సాంఘిక కార్యకలాపాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

జగన్ పాలనతో ప్రజలకు విసుగు : పల్లె

పుట్టపర్తి అర్బన్ : జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో సత్యమ్మ గుడి వద్ద మహాశక్తి చైతన్య రథంను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ, మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. మహిళల కోసం ప్రకటించిన పథకాలన్నీ ఎంతో ఉపయోగపడతాయని వీటిని 40 రోజులపాటు నియోజకవర్గంలో చైతన్య రథం ద్వారా టిడిపి మహిళలు, కార్యకర్తలు ప్రజలకు వివరిస్తారన్నారు. అనంతరం అక్కడ ఉన్న చిరు వ్యాపారులను పలకరించి వారి వ్యాపారాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు మహమ్మద్ రఫీ, సామ కోటి ఆదినారాయణ, సాలక్క గారి శ్రీనివాసులు, బొమ్మయ్య, మనోహర్, కోనంకి గంగాధర్, జయప్రకాష్ పాల్గొన్నారు.


చైతన్యరథం ప్రారంభిస్తున్న పల్లె

ఎమ్మెల్యేను కలిసిన విద్యార్థి విభాగం నాయకులు

పరిగి : ఎంఎస్‌ఎఫ్ విద్యార్థి విభాగం నాయకుడు రవికుమార్ గౌరీబిదనూర్ ఎమ్మెల్యే పుట్టస్వామి గౌడ్‌ను సోమవారం కలిశారు. ఇటీవలే జరిగిన కర్నాటక ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి అత్యధిక మెజార్టీతో గెలుపొందిన ఆయనకు రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి ప్రజల మన్నలను పొంది ఆయనకు ప్రజలు పట్టం కట్టారని అన్నారు. కర్నాటక సమీపంలో ఉన్న చౌలూరు ప్రాంతాన్ని కూడా ఎమ్మెల్యే తన వంతు సహాయ సహకారాలతో అభివృద్ధికి సహకారం అందించినట్లు రవికుమార్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఎపిడిఎస్ నారాయణ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే పుట్టస్వామి గౌడ్‌తో రవికుమార్

బండి కాదు... జగమొండి

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఆర్టీసీ బస్సులు నిత్యం మొరాయిస్తూ ప్రయణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. కాలం చెల్లిన బస్సులను యథాతథంగా ఉపయోగిస్తుండటంతో ఈ సమస్య నెలకొన్నట్లు తెలుస్తోంది. కాలంచెల్లిన బస్సులు వాతావరణాన్ని కాలుష్యం చేయడంతో పాటు ఎక్కడికక్కడ మొరయిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా హిందూపురం నుండి చిలమత్తూరు కి వచ్చే బస్సు కనుమ మిట్ట, టేకులోడు క్రాస్ వద్ద మిట్టను ఎక్కలేక మొరయిస్తుంది. ఇక బస్సులో ఉన్న ప్రయాణికులు బస్సు దిగి నెట్టితే తప్ప బస్సు స్టార్ట్ అవదు. ఇది నిత్యకృత్యం అయిందని ప్రయాణికులు చెబుతున్నారు.సోమవారం టేకులోడు క్రాస్ వద్ద ఈ చిత్రం ప్రజాశక్తి కంట పడింది. డిపో అధికారులు చొరవ తీసుకొని కాలం చెల్లిన బస్సులకు స్వస్తి చెప్పాలని ప్రయాణికులు కోరుతున్నారు. టికెట్ కొని మరి బస్సును బతిమిలాడుకున్నట్లు ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఆర్టీసీ బస్సును తోస్తున్న ప్రయాణికులు

మృతుని కుటుంబానికి తక్షణసాయం

హిందూపురం : పట్టణంలోని ముదిరెడ్డి పల్లిలో నాగార్జున (24) అనే వ్యక్తి ఆదివారం గుండె పోటుతో మృతి చెందారు. మృతుని కుటుంబానికి వైఎస్ఆర్ బీమా పథకం కింద తక్షణ సాయంగా వార్డు కౌన్సిలర్ మద్దెన జయ రాములు రూ.10వేలు అందించారు.

అనర్హులను తొలగించాలి

ఓబులదేవరచెరువు : ప్రభుత్వం చేపడుతున్న అసైన్మెంట్ భూ పంపిణీ ఓడి చెరువు మండలంలో అనర్హులకు చోటు కల్పించాలని ఈవిషయంలో అర్హులకు న్యాయం చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆపార్టీ నాయకులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహశీల్దార్ రామనాథ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు.

నేరాలు ఘోరాలు

8.900 కిలోల గంజాయి స్వాధీనం

ఎనిమిది మంది అరెస్టు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురంలో భారీ ఎత్తున పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రెండు వేర్వేరు ఘటనల్లో ఎనిమిది మంది నుంచి 8.900 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను టూటౌన్ సిఐ వై.శ్రీనివాసులు, రూరల్ అప్ గ్రేడ్ సిఐ కృష్ణారెడ్డి విలేకరులకు వెల్లడించారు. ఆదివారం రాత్రి శ్రీ సత్యసాయి జిల్లా టూటౌన్ స్టేషన్ పరిధిలోని భగిరథ సర్కిల్ మధుగిరి మారెమ్మ ఆలయ సమీపంలో అక్రమంగా గంజాయిని విక్రయిస్తున్న 7 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 7.400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని విక్రయిస్తున్న హిందూపురం పట్టణానికి చెందిన కళ్యాణ్ కుమార్, సోమేష్, నాగర్జున, అనిల్ కుమార్, తిరుమలేష్, మడకశిర మండలం శివపురం గ్రామానికి చెందిన సురేష్, కదిరి ప్రాంతం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన జంపాల సోమశేఖర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కల్యాణ్ కుమార్, సోమేష్, నాగర్జున, అనీల్ కుమార్, తిరుమలేష్, సురేష్, సోమశేఖర్‌లు స్నేహితులు. మద్యానికి బానిసైన వీరు హిందూపురం మండలం మిట్టమీదపల్లి గ్రామానికి చెందిన సురేష్ వద్ద గంజాయిని కొని తాగేవారు. సురేష్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో విశాఖపట్నం, అరకుకు వెళ్లి గంజాయిని తెచ్చేవారు. ఈ నెల 19వ తేదీన 8 కిలోల గంజాయిని విశాఖపట్నంకు గోల్గేరి అర్జున్, కొంతేటి శ్రీరామ్‌ల నుంచి అరకులో గంజాయిని తీసుకుని హిందూపురానికి వచ్చాడు. ఆదివారం రాత్రి భగిరథ సర్కిల్ సమీపంలో కళ్యాణ్ కుమార్, సోమేష్ కుమార్‌లు వారి స్నేహితులైన నాగార్జున, తిరుమలేష్, సురేష్, అనిల్ కుమార్, జంపాల సోమశేఖర్‌లను పిలిపించి గంజాయి అమ్మడాని ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులకు పక్కా సమాచారం రావడంతో ఎస్ఐ భాస్కర్ ప్రసాద్ రాజు, తహసీల్దార్ హసీనా సుల్తానా, సెబ్ సిఐ స్వర్ణలతలతో కలిసి వారిని అదపులోకి తీసుకున్నారు. ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్నా 7.400 కిలోల గంజాయిని సీజ్ చేశారు.


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

గోళ్లాపురంలో 1.500 కిలోలు స్వాధీనం

హిందూపురం రూరల్ మండలం గోళ్లాపురం పారిశ్రామిక వాడలోనూ సోమవారం నాడు ప్రత్యేక బృందాలతో పోలీసులు తనఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో గంజాయిని తరలిస్తున్న ఒడిషా రాష్ట్రం గంజాం జిల్లా దిగపహండి తాలూకా పుడమరి గ్రామానికి చెందిన నరహరి ప్రధాని కుమారుడు నిలాంచల్‌ను అదపులోకి తీసుకున్నారు. అతని వద్ద 1500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణ, విక్రయం కేసులో ఇంకొంత మంది నిదింతులు ఉన్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

గంజాయిని విక్రయిస్తే కఠిన చర్యలు
టూటౌన్ సిఐ వై శ్రీనివాసులు, రూరల్ అప్ గ్రేడ్ సిఐ కృష్ణా రెడ్డి

గంజాయి విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సిఐ వై.శ్రీనివాసులు, రూరల్ అప్ గ్రేడ్ సిఐ కృష్ణా రెడ్డిలు తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాలను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు జిల్లా పోలీస్ యంత్రంగం ప్రత్యేక ప్రణాళికలను ఏర్పాటు చేసుకుని మండలాలు, గ్రామాల్లో నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గంజాయి వస్తున్నట్లు గుర్తించామన్నారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడరాదన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అమ్మకాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

ఓబుల దేవర చెరువు : మండలంలోని గౌరాపురం గ్రామానికి చెందిన నరేష్ (26) అనుకోకుండా జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. ఎస్ఐ గోపీ తెలిపిన వివరాలు... నరేష్ మద్యం తాగి భార్యతో గొడవ పడ్డాడు. ఈసందర్భంగా సర్ధిచెప్పే ప్రయత్నంలో నరేష్‌ను అతని తండ్రి నరసింహులు అతనిని పక్కకు తోశాడు. దీంతో నరేష్ తల గోడకు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన నరేష్ కదిరి ప్రభుత్వ ఆసుపత్రి తరలించాడు. అక్కడ నరేష్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు మృతుడి తండ్రిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరికి గాయాలు...

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని మహమ్మదాబాద్ క్రాస్ వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గోరంట్ల నుండి కారులో నలుగురు వ్యక్తులు కదిరి వస్తుండగా మహమ్మదాబాద్ క్రాస్ వద్ద వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొంది. ఈ ప్రమాదంలో అమడగూరు మండలం చిన్నపసానిపల్లి చెందిన అశోక్ ,పగడాల వారి పల్లి చెందిన రమేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. సోము, ఆనంద్ స్వల్పంగా గాయపడ్డారు. అశోక్ పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపీ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

ముదిగుబ్బ : మండల కేంద్రానికి చెందిన మౌలా అనే వ్యక్తి కన్పించడం లేదని ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెలలో ఇంటి నుంచి వెళ్లిపోయాడని, పలుచోట్ల వెతికిన కనిపింలేదని ఆమె వాపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ఐసిఐసిఐ బ్యాంక్ సమీపంలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం తెలిపారు. వారి వద్ద నుండి రూ.20,350 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కణేకల్లు : మండల పరిధిలోని నల్లంపల్లి గ్రామ సమీపంలో బసయ్య తోట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎరుకుల ఎల్లప్ప(35) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆలూరు వద్ద నివాసం ఉంటున్న ఎల్లప్ప తన సోదరుడైన నాగరాజుతో కలిసి ద్విచక్ర వాహనంపై రాయదుర్గం వెళ్లాడు. అక్కడ పని ముగించుకున్న వారు తిరిగి సొంత ఊరికి బయల్దేరారు. అయితే మార్గమధ్యలో బసయ్య తోట వద్ద అదుపుతప్పి కిలోమీటర్ రాయిని ఢీకొనడంతో ఎల్లప్ప అక్కడికక్కడే మృతి చెందగా నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలిసిన వెంటనే మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

చిలమత్తూరు : గతంలో పలగలపల్లి లో వెల్ఫేర్ అసిస్టెంట్ గా పని చేసే మహిళాఉద్యోగి ఈ నెల 5 న కొత్తచెరువుమండలానికి బదిలీ పెట్టుకొంది.అందులో బాగంగా 6 వ తేదిన అడ్మిట్ అయింది.అయితే ఎల్పిసి(లాస్ట్ పే సర్టిఫికెట్) కార్యదర్శి ఇవ్వాల్సుండగా 15 రోజులుగా సతాయిస్తున్నాడని దీంతో బాధిత మహిళ సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీనిపై సబ్ కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఎవరా కార్యదర్శి? ఇక్కడున్నాడా? ఎందుకు స్పందనకు రాలేదు? ఈ ఉద్యోగి సమస్యపై వివరణ అడగండి సరైన సమాధానం ఇవ్వకుంటే సస్పెండ్ చేస్తాం అని హెచ్చరించారు.

వరి నారుపై విష ప్రయోగం

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని పెడపల్లి గ్రామానికి చెందిన రైతు లక్ష్మీనారాయణ రెడ్డి నారు పైరుపై విషప్రయోగం జరిగింది. విషపు గుళికలను గుర్తు తెలియని వ్యక్తులు వరినారుపై చల్లారు. గ్రామ సమీపంలో తన వ్యవసాయ బోరు వద్ద మూడు ఎకరాల్లో వరి నాటడానికి 5వేల రూపాయలతో విత్తన వడ్లు కొనుగోలుచేసి పది రోజుల క్రితం వరి నారు పోశానని బాధిత రైతు లక్ష్మినారాయణరెడ్డి తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు తనపై కక్షగట్టి నారు పైరును ధ్వంసం చేయడానికి గ్లైసిల్ గుళికలు నారుమడిలో చల్లారని రైతు వాపోయారు. ఈ విషయాన్ని సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.